సాక్షి
అనకాపల్లి
గురువారం । 3 । అక్టోబర్ । 2024



## ఎంతో విశిష్టం.. దసరా సంబరం

మాడుగులలో దసరా ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. రాజుల కాలంలో కోటలో దసరా ఉత్సవాలు నిర్వహించేవారు. 8లో



## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

గాంధీ జయంతి సందర్భంగా వడ్డాదిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 850 మంది రక్తదానం చేశారు. 8లో



## మున్సిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష

తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఉపాధ్యాయులు నెహ్రూచౌక్‌లో ఒక రోజు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. 8లో

# పేద విద్యార్థులపై కాల ‘కూట’ విషం

పేద విద్యార్థులతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాట మాడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేసి వారి భవిష్యత్తుపై విషం చిమ్మి, తీరని అన్యాయం చేసింది. పరోక్షంగా కార్పొరేట్ స్కూళ్లకు లబ్ధి చేకూరుస్తోంది.

- సర్కార్ బడుల్లో సీబీఎస్ఈ సిలబస్‌కు మంగళం
- విద్యా సంవత్సరంలో మూడు నెలలు గడిచిన తరువాత నిర్ణయం
- టెన్త్ పరీక్షలు స్టేట్ సిలబస్‌లో రాయాలంటూ ఆదేశాలు
- జిల్లాలో 41 సర్కార్ బడుల్లో సీబీఎస్ఈ చదువుతున్న 1,280 మంది విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి: పేదోడి ఇంట పుట్టడమే పాపమా..! పేద విద్యార్థులు ఇంగ్లిషు మీడియం చదవకూడదా..డబ్బున్న వారే ఇంగ్లిషు మీడియం, సీబీఎస్ఈ సిలబస్‌లు చదవాలా..? మేము చేసిన పాపమేమిటని ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌లో 9వ తరగతి పూర్తి చేసుకుని ఈ ఏడాది పదో తరగతిలోకి అడుగుపెట్టిన విద్యార్థుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి విద్యార్థీ తన ఎడ్యుకేషనల్ కెరీర్‌లో పదో తరగతి కీలకమైన ఘట్టంగా భావిస్తారు. టెన్త్‌లో సాధించే మార్కుల ఆధారంగానే భవిష్యత్తు ఉంటుంది. అందువల్లే ఉపాధ్యాయులు కూడా పదోతరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. కానీ కూటమి ప్రభుత్వం దానికి విరుద్ధంగా ప్రభుత్వ హైస్కూళ్లలో సీబీఎస్ఈ సిలబస్‌కు మంగళం పాడేసింది. రద్దు చేస్తున్నామంటూ ఇటీవల ప్రకటించి ఆ విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా విద్య, వసతి ఉచితంగా కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా గత ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేపట్టారు. సర్కారు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా సకల సదుపాయాలు కల్పించి జాతీయ, అంతర్జాతీయ పోటీ పరీక్షల్లో రాణించేలా బోధన ఉండాలని భావించారు. అందుకే కార్పొరేట్ స్కూళ్లకే పరిమితమైన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. అనకాపల్లి జిల్లాలో తొలి దశలో ఎంపిక చేసిన 41 ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి నుంచి అమలు చేశారు. సుమారు 1,280 మంది విద్యార్థులు ఈ సిలబస్ చదువుతున్నారు. వారు ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు సీబీఎస్ఈ సిలబస్‌లో సన్నద్ధమవుతున్న తరుణంలో ఇప్పుడు హఠాత్తుగా స్టేట్ సిలబస్ పరీక్షలు రాయాలంటూ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

**పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా..**

జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు సీబీఎస్ఈ బోధనను గత ప్రభుత్వం తీసుకువచ్చింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ బోధించడం ద్వారా పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపేందుకు అవకాశం ఉంటుంది. ఈ సిలబస్ చదివితే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో సత్తా చాటే అవకాశం దక్కుతుంది. రెండెకరాలకు పైగా విస్తీర్ణం ఉన్న పాఠశాలలను గుర్తించి సీబీఎస్ఈ సిలబస్ బోధనకు గత ప్రభుత్వం ఎంపిక చేసింది.



నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు(ఫైల్)

**41 పాఠశాలల్లో అమలు..**

కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, సంక్షేమ వసతి పాఠశాలలతో పాటు జిల్లాలోని తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలున్న ఉన్నత పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలులోకి తెచ్చారు. జిల్లావ్యాప్తంగా 41 పాఠశాలల్లో 1,280 మంది విద్యార్థులు ఈ సిలబస్‌లో చదువుతున్నారు. జిల్లాలో సీబీఎస్ఈ అమలులో ఉన్న స్కూళ్లలో 8,9,10 తరగతులకు బోధిస్తున్న 180 మందికి పైగా సబ్జెక్టు టీచర్లకు శిక్షణ ఇచ్చారు.

### ఈ ఏడాదికి సీబీఎస్ఈ రద్దు



ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఈ ఏడాదికి సీబీఎస్ఈ సిలబస్ రద్దు చేయడం జరిగింది. ఇటీవల నిర్వహించిన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో మెజారిటీ విద్యార్థులకు వారి మార్కులు తక్కువగా వచ్చాయి. దీంతో ప్రభుత్వం ఈ ఏడాదికి సీబీఎస్ఈ లేకుండా స్టేట్ సిలబస్‌లోనే కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తున్న 41 స్కూళ్లలో 10వతరగతి విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధిస్తున్నాం. వారు స్టేట్ బోర్డు పరీక్షలకుసన్నద్ధమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు స్టేట్ సిలబస్ కొనసాగుతోంది.

– వెంకట లక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి జిల్లా

### ప్రైవేట్ విద్యాసంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే..

విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచాక స్టేట్ సిలబస్‌లో పరీక్షలు రాయాలంటూ కూటమి ప్రభుత్వం చెప్పడంతో అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే సీబీఎస్ఈ సిలబస్‌లో యూనిట్ పరీక్షలు రాశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు లాభం చేకూర్చేందుకే చంద్రబాబు నేతృత్వంలో కూటమి సర్కారు సెంట్రల్ సిలబస్ రద్దు చేసిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. సీబీఎస్ఈ సిలబస్‌ను రద్దు చేసి చంద్రబాబు మరోసారి పేదలకు వ్యతిరేకమని సుస్పష్టమైందని పలువురు విమర్శిస్తున్నారు. ఐఐటీ, ఎయిమ్స్ వంటి సంస్థల్లో చదవాలనుకుంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు చాలాసహాయపడతాయి.

## న్యూస్‌రీల్

### అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటిన తల్లీకూతుళ్లు

- పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన నాగజ్యోతి, సాహితీ



తల్లీకూతుళ్లు నాగజ్యోతి, సాహితీలను సత్కరిస్తున్న నారాయణరావు, గోపీనాథ్

నర్సీపట్నం: గత నెల 22 నుంచి 30 వరకు సింగపూర్, మలేషియాలలో భారతీయ కేర్ ఫౌండేషన్ నిర్వహించిన అంతర్జాతీయ అథ్లెటిక్స్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తల్లీకూతుళ్లు సత్తా చాటారు. తల్లి పి.వి.ఎం.నాగజ్యోతి(ఉపాధ్యాయుని) పవర్‌లిఫ్టింగ్, అథ్లెటిక్ పోటీల్లో, కుమార్తె సాహితీ స్విమ్మింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. వీరిని వ్యాపారవేత్త వెలగా నారాయణరావు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ నాగజ్యోతి ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దడంతో పాటు పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్నారని చెప్పారు. తల్లిని ఆదర్శంగా తీసుకుని కుమార్తె సాహితీ స్విమ్మింగ్‌లో దూసుకుపోతున్నట్టు చెప్పారు. సింగపూర్, మలేషియాలలో జరిగిన పోటీల్లో నాగజ్యోతి పవర్ లిఫ్టింగ్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్, అథ్లెటిక్స్ విభాగంలో డిస్క్, జావలిన్‌త్రోలలో ప్రథమస్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీస్థానంలో నిలిచి వెండి పతకం సాధించారని తెలిపారు. కుమార్తె సాహితీ స్విమ్మింగ్ 50 మీటర్లు, బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్లు, బ్యాక్‌స్ట్రోక్ 59 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు సాధించారన్నారు.

### రైవాడలో నిలకడగా నీటి మట్టం



రైవాడ జలాశయం స్పిల్‌వే గేటు నుంచి విడుదల చేస్తున్న వరదనీరు

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో నీటి మట్టం నిలకడగా ఉంది. తాజాగా జలాశయంలోకి 500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. 9వ నంబర్ స్పిల్‌వే గేటు ద్వారా 150 క్యూసెక్కుల వరదనీటిని శారదానదిలోకి విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 113.50 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో ఆధారంగా నీటి విడుదల పెంపు లేదా తగ్గించడం జరుగుతుందని ఇరిగేషన్ డీఈఈ జి.సత్యంనాయుడు తెలిపారు. శారదానది పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

### రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 4వ తేదీన నగర మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నారు. స్థాయీ సంఘ సమావేశ మందిరంలో జరగనున్న ఈ సమావేశంలో సభ్యుల ఆమోదానికి 124 అజెండా అంశాలు చర్చకు రానున్నాయి.

### రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు వరాహపురం విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వరాహపురం హైస్కూలు విద్యార్థులు

చీడికాడ: మండలంలో వరాహపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడి హైస్కూలు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి పోటీల్లో వరాహపురం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం దొడ్డి వరాహమూర్తి, పీడీ ఆర్.సింహాచలం, సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ ఎంపీపీ డి.స్వాతి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

## మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు చైర్‌పర్సన్ ఫిర్యాదు



ఆవేదన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: ప్రొటోకాల్ పాటించని మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్రపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నర్సీపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి కలెక్టర్ విజయకృష్ణన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. గాంధీ జయంతి సందర్భంగా మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవ ముగింపు కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. స్వచ్ఛతాహీ సేవ బ్యానర్‌పై చైర్‌పర్సన్ ఫొటో ముద్రించకపోవడంతో ప్రొటోకాల్ ప్రకారం తన ఫొటో ఎందుకు ముద్రించలేదని కమిషనర్‌ను ఆమె నిలదీశారు. ఈ అంశాన్ని కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో వి.వి.రమణ దృష్టికి ఆమె తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి కార్యక్రమంలో ప్రొటోకాల్ ఉల్లంఘించి తనను అవమానిస్తున్నారు. దళిత మహిళలను కాబట్టే అవమానాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించని మున్సిపల్ కమిషనర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని చెప్పారు. మున్సిపాలిటీ ప్రథమ పౌరురాలైన తనకు కనీసం విలువ ఇవ్వడం లేదని తెలిపారు.

## జూలో వెటర్నరియన్ పోస్టుకు దరఖాస్తులు

ఆరిలోవ(విశాఖ): ఇందిరాగాంధీ జూ పార్కులో వెటర్నరియన్ పోస్టు కాంట్రాక్ట్ బేసిస్‌పై భర్తీ చేయనున్నట్లు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. నెలకు రూ.50,000 వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5గంటల లోగా జూ క్యూరేటర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

## కొత్త మద్యం పాలసీతో నేరాంధ్ర ఖాయం

- ప్రజారోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం
- ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా



అనకాపల్లి నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

అనకాపల్లి : కూటమి ప్రభుత్వం అక్టోబర్ నుంచి అమలు చేస్తున్న కొత్త మద్యం పాలసీ ద్వారా రాష్ట్రంలో నేరాలు విపరీతంగా పెరడంతో పాటు, లక్షలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని, రాష్ట్రంలో తక్షణమే మద్యాన్ని నిషేధించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు వి.మాణిక్యం అన్నారు. స్థానిక నెహ్రూ చౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ విధానాల్లో ప్రైవేట్ వ్యక్తులకు మద్యం షాపులను ఇస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, మద్యం విక్రయాలతో లైసెన్సు ఫీజుల ద్వారా రూ.200 కోట్ల ఆదాయాన్ని రాబట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మద్యం నియంత్రించి, నేరాలను అరికట్టాలని, మహిళలు, పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలను నిర్మూలించడానికిప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ ఆదాయాన్ని పొందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమా ? అని ప్రశ్నించారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, సభ్యులు లక్ష్మి,నారాయణమ్మ, తులసి, నూకరత్నం, సుగుణ, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

## కనకమహాలక్ష్మి గర్భాలయ ప్రవేశాలు రద్దు

- దేవీ శరన్నవరాత్రుల నేపథ్యంలో..

డాబాగార్డెన్స్(విశాఖ): కనక మహాలక్ష్మీ దేవస్థానంలో గురువారం నుంచి 12వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఏఈవో కె.తిరుమలేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఉదయం 6.30 నుంచి 9 గంటల వరకు అమ్మవారి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలు జరిగే అన్ని రోజుల్లో పంచామృతాభిషేకం, మంగళవారం నిర్వహించే అష్టదళ పద్మారాధన, శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవ, శనివారం నిర్వహించే లక్ష తులసిపూజ తదితర విశేష సేవలు, పూజలను రద్దు చేసినట్లు వెల్లడించారు. ఈ రోజుల్లో అమ్మవారి గర్భాలయ దర్శనాలు కూడా ఉండవని స్పష్టం చేశారు.

## గాంధీ, శాస్త్రిల జీవితం స్ఫూర్తిదాయకం



గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల, జేసీ జాహ్నవి

తుమ్మపాల: జాతిపిత మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరంగా జీవించి స్వాతంత్ర్యోద్యమం ద్వారా దేశప్రజలకు స్వేచ్ఛను ఇవ్వడంలో ముఖ్య పాత్ర పోషించారని, వారి జీవితం అందరికీ ఆదర్శమని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు.పట్టణంలో బెల్లం మార్కెట్ వద్ద నిర్వహించిన గాంధీజయంతి ఉత్సవాల్లో ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ జాహ్నవి, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరులు మహాత్ముని విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ చేసిన శాంతియుత పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. అంతకుముందు నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో కలెక్టరేట్ ప్రాంగణం, శంకరం రైల్వే బ్రిడ్జి మీద చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.కలెక్టర్, జేసీ స్వయంగా కొడవలి చేతపట్టి మొక్కలను కట్ చేశారు. చీపురుతో రోడ్డును శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి చిన్నికృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈదురు గాలులతో భారీ వర్షం



యానాద్రి కాలనీలో కూలిన విద్యుత్ స్తంభం



పెదపల్లి రైల్వేగేటు సమీపంలో కూలిన చెట్లు

- యలమంచిలి పట్టణంలో కూలిన 40 చెట్లు, 10 విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా

యలమంచిలి రూరల్: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు గంటన్నర సేపు భారీ వర్షం కురిసింది.ఒక్కసారిగా ఆకాశంలో దట్టమైన మేఘాలు అలముకుని ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు వీధుల్లో చెట్లు,విద్యుత్ స్తంభాలు నేలకూలాయి.విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.గ్రీన్‌సిటీ, హైవే పక్కన,ప్రేమ సమాజం, రాంనగర్, యానాద్రి కాలనీ,అల్లూరి సీతారమరాజు కాలనీ,ఎర్రవరం,విద్యుత్ ఉపకేంద్రం వద్ద,కోర్టుపేట,రైల్వేస్టేషన్ రోడ్డు, నాగేంద్ర కాలనీ, ఓరుగంటివారి వీధి తదితర ప్రాంతాల్లో రహదారులపై సుమారు 40 వరకు చెట్లు,చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. 10 విద్యుత్ స్తంభాలు కూలాయి. రహదారులపై విరిగి పడిన చెట్లు,కొమ్మల్ని జేసీబీలు,కోత యంత్రాలతో తొలగించేందుకు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఇంజినీర్లు,పట్టణ ప్రణాళికా విభాగం సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. విరిగిన,ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి ఆ శాఖ సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.రాత్రి 8 గంటల సమయానికి పట్టణంలో కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణమంతా అంధకారం అలముకుంది.బలమైన ఈదురు గాలుల ధాటికి అరటి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, ఉక్కబోతతో అల్లాడిన జనం భారీ వర్షంతో ఉపశమనం పొందారు.వరి పంటకు ఈ వర్షం మేలు చేస్తుందని రైతులు తెలిపారు.

# ఉపమాకకు బ్రహ్మోత్సవ శోభ

- నేడు అంకురార్పణ
- 12 వరకు ఉత్సవాలు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 3వతేదీ నుంచి స్వామివారి వార్షిక బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా కన్యా సంక్రమణంలో నిర్వహించే ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి గురువారం రాత్రి అంకురార్పణ జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు తెలిపారు. ఆరోజు ఉదయం స్వామివారి ఉత్సవ కావిడెను ఉపమాక మాడవీధుల్లో ఊరేగించి, బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయంటూ భక్తులకు తెలియజేస్తారు. అనంతరం స్వామివారిని పెద్దపల్లకిలో ఉంచి తిరువీధి సేవ నిర్వహిస్తారు. అంకురార్పణలో భాగంగా గురువారం రాత్రి విష్వక్సేన పూజ, ఉత్సవాంగీకారం, పుణ్యాహవచనం,కంకణ ధారణ నిర్వహిస్తారు. అనంతరం మత్స్యం గ్రహణంలో భాగంగా సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేయింపుజేసి ఉత్తర ఈశాన్యంలో గల ప్రాంతంలో మత్స్యంగ్రహణ కార్యక్రమం(పుట్టమన్ను తెచ్చేకార్యక్రమం) పూర్తి చేసి తిరువీధి సేవ నిర్వహిస్తారు. తదుపరి ఆలయంలో నిత్యసేవ, ప్రసాద నివేదన, నీరాజన మంత్రపుష్పాలు తీర్థగోష్టి, ప్రసాద వినియోగం అనంతరం అశ్వవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తులను వేం చేయింపజేసి గ్రామంలో తిరువీధి సేవ నిర్వహించనున్నట్టు ప్రసాదాచార్యులు తెలిపారు.

అనంతరం తాత్కాలిక యాగశాలలో అంకురార్పణ కార్యక్రమం, గరుడ అవాహన, గరుడప్పాలు నివేదన , తీర్థగోష్టి కార్యక్రమాలతో మొదటి రోజు కార్యక్రమాలు పూర్తవుతాయని చెప్పారు.

రెండో రోజు శుక్రవారం 4వ తేదీన ఉదయం నిత్యకార్యక్రమాలు బేరీ పూజ, ఉత్సవమూర్తులను పెద్ద పల్లకిలో వేంచేయింపజేసి ముందుగా ఆలయంలోను తర్వాత గ్రామంలో గల అష్ట దిక్పాలకులకు ఆహ్వానం పలకడం జరుగుతుందని ప్రసాదాచార్యులు చెప్పారు. అనంతరం స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. ఆలయంలో ఉన్న ధ్వజస్తంభం వద్ద ధ్వజపటాన్ని ఎగుర వేస్తారు. ఉదయం సాయంత్రం సుదర్శన పెరుమాళ్ల వారిని పల్లకిలో వేంచేయింపజేసి గ్రామ బలిహరణలు నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులను వివిధ వాహనాల్లో ఉంచి తిరువీధి సేవ నిర్వహిస్తారు. ఉత్సవాల పదిరోజులు ఉదయం సాయంత్రం స్వామివారి దివ్యప్రబంధసేవ నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా 9వతేదీ బుధవారం సాయంత్రం వసంతోత్సవం నిర్వహిస్తారు. ఆస్థాన మండపంలో స్వామివారిని ఉంచి సప్త రుషుల ఆవాహనం నిర్వహించి, తర్వాత స్వామివారిని గరుడ వాహనంపై ఉంచి గ్రామంలో తిరువీధి సేవ జరపనున్నట్టు అర్చక స్వాములు ప్రసాద్, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు తెలిపారు. వసంతాన్ని ఒకరిపై ఒకరు జల్లుకుంటూ ఎంతో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. 10తేదీన ఆలయంలో ముందుగా అష్టదిక్పాలకుల ఆవాహన తర్వాత రథోత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ మూర్తులను పుణ్యకోటి వాహనంలో ఉంచి రథబలి నిర్వహించిన తర్వాత తిరువీధి సేవ నిర్వహిస్తారు. 11వతేదీన సాయంత్రం స్వామివారి పుష్కరిణి వద్ద గల లంకవారి మండపంలోకి స్వామివారి ఉత్సవమూర్తులను గజవాహనంలో తీసుకు వెళ్లి మృగవేట కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 12వ తేదీన ఆలయంలో నిత్యకార్యక్రమాలు బలివిసర్జనలు పూర్తిచేసిన తర్వాత యాగశాల వద్ద పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం వినోదోత్సవంలో భాగంగా స్వామివారిని ఏడు ముసుగులలో అలంకరించి ఉంగరపు సేవ నిర్వహిస్తామన్నారు. తదుపరి పుణ్యకోటి వాహనంలో తిరువీధి సేవ జరుపుతారు.అనంతరం ఆలయంలో లక్ష్మీ సంవాదం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, డోలోత్సవం, కంకణ విసర్జనలు, సుదర్శన పెరుమాళ్లవారిని పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి చక్రవారి స్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ఉత్సవాలు పూర్తిఅయిన తర్వాత ధ్వజ అవరోహణ కార్యక్రమం ఉంటుంది. అదేరోజు రాత్రి స్వామివారి ఆస్థాన మండపంలో ద్వాదశ తిరువారాధన, విశేషప్రసాద నివేదన, తీర్థగోష్టి నిర్వహించడంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



స్వామివారి ఉత్సవమూర్తులు



గరుడాద్రిపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్

### 10 రోజులపాటు దసరా ఉత్సవాలు

శరన్నవరాత్రులు పురస్కరించుకుని ఉపమాక ఆలయంలో గోదాదేవి సన్నిధిలో పదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. ప్రతిరోజు అమ్మవారి సన్నిధిలో సాయంత్రం లక్ష్మీసహస్రనామకుంకుమార్చన జరుగుతుందన్నారు. విజయదశమినాడు స్వామివారి ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు తీసుకెళ్లి శమీపూజ నిర్వహించనున్నట్టు అర్చకులు చెప్పారు.

ప్రజలు త్యాగాలకు సిద్ధం కావాలి — స్టీల్ ప్లాంట్ రక్షణకు ఆందోళన 8లో

## క్లుప్తంగా

### 4న ఉచిత ఇసుక పథకం అమలుకు ఆందోళన

అనకాపల్లి: ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం ఉచితంగా ఇసుక ఇవ్వాలని, ఇసుక సమస్య సమస్యను పరిష్కరించాలని, కార్మికుల సంక్షేమబోర్డు పథకాలు అమలు చేయాలన్న డిమాండ్‌తో జిల్లాల్లో అన్ని గ్రామాల్లో ఆందోళనలు చేయనున్నట్టు తెలిపారు. గతంలో కంటే అధిక ధరలకు ఇసుకను కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.

### కళ్లలో కారంకొట్టి మెడలో బంగారు చైన్ అపహరణ

రాంబిల్లి (యలమంచిలి) : లాలంకోడూరు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఒక ఇంటిలో నిద్రిస్తున్న వ్యక్తి మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకు పోయినట్టు రాంబిల్లి సీఐ సిహెచ్. నర్సింగరావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ తెలిపిన వివరాలివి. లాలంకోడూరు గ్రామానికి చెందిన బండారు సుధీర్‌కుమార్ తన ఇంట్లో నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి తన ఇంట్లోకి ప్రవేశించి తనపై దాడి చేసి కళ్లలో కారం చల్లి మెడలో ఉన్న 2 తులాల బంగారు గొలుసును అపహరించుకు పోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. రాంబిల్లి పోలీసులు క్లూస్ టీం సంఘటన స్థలానికి చేరుకొని ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### రిసార్ట్‌లో వ్యక్తి అనుమానాస్పద మృతి

అచ్యుతాపురం (మునగపాక) : అచ్యుతాపురం మండలం కొండకర్ల రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని గోపాలపట్నంకు చెందిన పెదపాటి రాజు(39) అచ్యుతాపురంలోని అబ్జిత్ కంపెనీలో పనిచేస్తూ కొంత కాలం క్రితం ఉద్యోగం మానివేశాడు. గతంలో కంపెనీలో పనిచేసిన సహచర స్నేహితులతో కలిసి అచ్యుతాపురం మండలం కొండకర్లలోని రిసార్ట్‌లో మంగళవారం రాత్రి బస చేశారు. రాత్రి అందరూ ఉత్సాహంగా ఆటపాటలతో గడిపారు. తెల్లవారున సమీపంలోని స్విమ్మింగ్ పూల్‌లో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న అచ్యుతాపురం పోలీసులు బుధవారం సంఘటన స్థలానికి చేరుకొని సంఘటనపై ఆరా తీస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ఎంతో విశిష్టం... మాడుగుల దసరా సంబరం

- సివిల్ ఆర్టీసీ ఆటో, మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- కనులు మిరిమిట్లు గొలిపే విధంగా దేవితల్లి అలంకరణ
- ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్ల ఏర్పాటు


మాడుగులలో దేవితల్లిని అలంకరించిన దృశ్యం


మాడుగుల కోటలో సాము గరిడీలు జరిగే ప్రదేశం


గుర్రాల సంత (ఫైల్)

మాడుగుల : మాడుగులలో దసరా ఉత్సవాలకు ఎంతో విశిష్టత ఉంది. రాజుల కాలంలో కోటలో దసరా ఉత్సవాలు నిర్వహించేవారు. ఇక్కడ నుంచి రాజులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, యుద్ధాలకు వెళ్లాలన్నా దేవి తల్లిని దర్శించుకుని బయలు దేరేవారని చెబుతారు. సమీపంలో ఉన్న పాండవుల కొండపై పాండవులు వనవాసానికి వచ్చిన సమయంలో ఇక్కడ దేవితల్లిని పాండవులు పూజించేవారని ప్రతీతి. దీంతో ఇక్కడ దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. రాజుల అనంతర కాలంలో మాడుగులలో ఉండే మోటారు యూనియన్ సంఘ సభ్యులు దసరా ఉత్సవాలు ఆనాటి సంప్రదాయంతో నిర్వహించుకుంటూ వస్తున్నారు. సివిల్ ఆర్‌టీసీ, ఆటో మోటార్ యూనియన్ ఆధ్వర్యంలో సుమారు 110 ఏళ్ల నుంచి ఏటా దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ యూనియన్ సభ్యులు చందాలు వేసుకుని గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాన్ని అందంగా రంగులతో అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. దేవితల్లిని అలంకరించారు.

**సాముగరిడీలు**

రాజుల కాలంలో మాడుగులలో ఏడు సావిడులు ఉండేవి. వాటిల్లో యువకులు కత్తిసాము, కర్రసాము, గుర్రపు స్వారీ శిక్షణ పొంది కోటలో రాజుల ముందు ప్రదర్శనలు ఇచ్చేవారు. రాజుల నుంచి కానుకలు అందుకునేవారు. దసరా ముందు రోజు సాయంకాలం నుంచి కోటబయలులో గుర్రాల పరుగు పందాలు, కత్తి యుద్ధం, సాముగరిడీల్లో యుద్ధ నిపుణులు పాల్గొనేవారు. ఉత్సవాల్లో సాము గరిడీలు ప్రత్యేక ఆకర్షణీయంగా ఉండేవని చెబుతారు.

**ఆయుధ పూజలు**

అలనాడు మహరాజులు వాడిన ఆయుధాలు ఈనాటి తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. దసరా ఉత్సవాల్లో దేవితల్లి ఆలయంలో ఆయుధ పూజలు అనంతరం కత్తిసాములు నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం ఈనాటికి కొనసాగడం విశేషం.

**గుర్రాల సంత**

మాడుగులలో దసరా ఉత్సవాలు పేరు చెబితే గుర్తుకు వచ్చేది గుర్రాల సంత. రాజుల కాలం నుంచి ఇక్కడ దసరా రోజు ప్రతి ఏటా గుర్రాలు సంత జరుగుతూ వస్తుండేది. గుర్రపు స్వారీలకు అవసరమైన గుర్రాల కొనుగోలు, అమ్మకాలు ఇక్కడ జరిగేవి. అయితే గుర్రపు స్వారీలు రానురాను తగ్గిపోవడంతో రేసు గుర్రాలు తగ్గిపోయాయి. దీంతో రెండేళ్లుగా ఇక్కడ దసరా నాడు గుర్రాల సంత జరగడం లేదు.

# సీతయ్యపేటలో దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారి ఉత్సవాలు

- ఏకశిల అమ్మవారి విగ్రహం
- దర్శనానికి తరలిరానున్న భక్తులు
- నేటి నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక పూజలు
- 10న అమ్మవారి తిరువీధి, తెప్పోత్సవం


ఏకశిల దుర్గా మల్లేశ్వర్ల అమ్మవారు

బుచ్చెయ్యపేట : మండలంలో గల సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం నుంచి నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. 3వ తేదీ నుండి 12వ తేదీ వరకు అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయి. సీతయ్యపేటలో ఏకశిల రూపంతో టన్ను బరువున్న దుర్గామల్లేశ్వర్ల అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలుస్తారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భవాని భక్తులు అమ్మవారి ఆలయంలో మాలలు ధరించి దీక్షలు చేపడతారు. ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా బారికేడ్లు, మంచి నీటి సదుపాయంతో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. ఈనెల 3న కలశ స్థాపనతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. రోజూ ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, కుంకుమార్చనలు చేస్తారు.10న మహిషాసుర మర్దనిగా అలంకరణ, సత్యనారాయణ వ్రతం, అగ్నిగుండం, మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, రాత్రికి భారీ మందుగుండు సామగ్రి వెలిగిస్తారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి తిరువీధి ఉత్సవం, కోనేరులో తెప్పోత్సవం, 11న సహస్ర కుంకుమార్చన, 12న అమ్మవారికి ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, ఆయుధపూజతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్త రామ భవాని తెలిపారు.

# రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదాన శిబిరంలో యువకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ


రక్తదాన చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ సభ్యులు

బుచ్చెయ్యపేట : గాంధీ జయంతి సందర్భంగా బుధవారం వడ్డాదిలోని కోవెల అప్పన్నదొర జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. బుచ్చెయ్యపేట ఎస్ఐ ఎ.శ్రీనివాసరావుతో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. సాయంత్రం వరకు సాగిన ఈ రక్తదాన శిబిరంలో 850 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్,ఎమ్మెల్యే రాజు,రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు,మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, పీలా గోవింద, గోల్డ్ రామానాయుడు,బీజేపీ అధ్యక్షుడు పరమేశ్వరరావు,కొత్తకోట సీఐ కోటేశ్వరరావు,ఎంపీడీవో విజయలక్ష్మి,ఈవో లవరాజు తదితర్లు రక్తదాన శిబిరాన్ని పరిశీలించి యువకులను ప్రోత్సహించారు. రక్తదాన శిబిరంలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిబిరంలో రక్తదానం చేసిన యువకులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. విశాఖకు చెందిన రెడ్ క్రాస్ సంస్థ సిబ్బంది రక్త సేకరణ జరిపారు.

## మూడు మండలాలకు 15 మద్యం షాపుల కేటాయింపు

కశింకోట: కొత్త మద్యం విధానంలో భాగంగా అనకాపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లో 15 మద్యం షాపులు కేటాయించినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి రూరల్ మండలంలో ఐదు షాపులు, కశింకోట మండలంలో ఆరు, మునగపాక మండలంలో నాలుగు మద్యం షాపులు కేటాయించారన్నారు. ఈ షాపులు కావలసిన వారు అనకాపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో ఈ నెల 9లోగా ప్రతి రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చనని, రిజిస్ట్రేషన్ ఫీజుగా రూ.2 లక్షలు చెల్లించవలసి ఉంటుందన్నారు. దీన్ని తిరిగి ఇవ్వబోరన్నారు. దరఖాస్తు దారులకు లాటరీ విధానంలో ఈ నెల 11న ఉదయం 8 గంటల నుంచి అనకాపల్లి పాత బస్టాండ్ వద్ద ఉన్న ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండపంలో షాపులు కేటాయిస్తామన్నారు.

## మున్సిపల్ టీచర్ల సత్యాగ్రహ దీక్ష

అనకాపల్లి : మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసులు విద్యాశాఖ పరిధిలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రధాన సమస్యలు నేటి వరకూ పరిష్కరించలేదని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ అన్నారు. నెహ్రూచౌక్‌లో యూటీఎఫ్ ఉపాధ్యాయులు ఒక రోజు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు ఉపాధ్యాయులకు మెడలో దండలు వేసి దీక్షను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నబ్బాయ్ మాట్లాడుతూ ప్రభుత్వ మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సెబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని కోరారు. మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలని మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులైన వారిని అర్బన్ ఎంఈవోలుగా నియమించాలని, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలకు చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించక పోతే దశలవారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు అక్కునాయుడు, రాజునాయుడు, బాషా, నాతవరపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముని అడుగుజాడల్లో యువత నడవాలి


రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సత్యవతి, దంతులూరి దిలీప్‌కుమార్


మహాత్మ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న సంఘం ప్రతినిధులు కె.కె.రెడ్డి, శ్రీనివాసరావు

అనకాపల్లి : నేటి యువత మహాత్మగాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం గాంధీజీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హక్కుల సాధనకు శాంతియుత పోరాట మార్గాన్ని ప్రవచించి, ఆచరణలో చూపిన గాంధీజీ చిరస్మరణీయులని అన్నారు. ప్రపంచానికి అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలను అందించిన గాంధీ మార్గం ఎప్పటికీ ఆదర్శప్రాయం...అనుసరణీయం అని ఆమె పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ శాంతిమార్గంలో బ్రిటిష్ పాలకులన మనదేశం నుంచి తరిమికొట్టి, దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన గాంధీజీ జీవిత చరిత్ర గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం పార్టీ శ్రేణులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి, కశింకోట మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, మలసాల కిషోర్, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ లక్ష్మీనరసింహం, బుద్ద రాజు, దాడి నారాయణరావు, కరక సోమునాయుడు, కలగ గున్నయ్యనాయుడు, మూనూరు శ్రీనివాసరావు, శ్రీధరాల మనోజ్, పల్లెల సాయికిరణ్, ఏడువాకల నారాయణరావు, ఆకుల సంతోష్, హైమావతి, లక్ష్మి పాల్గొన్నారు.

**జానకీరామరాజు కార్యాలయం వద్ద..**

ఉడ్‌పేట మహాత్మ సేవా సంఘం అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధి కె.కె.రెడ్డి, జి.శ్రీనివాసరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 150 మంది నిరుపేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. సంఘం సభ్యులు కొండబాబు, సకుర చంద్రం, కర్రి భాస్కరరావు, రామచంద్రరావు, ప్రకాష్, వీసం సతీష్, కాండ్రేగుల శ్రీనివాసరావు, మోదినాయుడు, శివప్రసాద్ పాల్గొన్నారు.



## నేవీ నిర్మాణ కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించవా..?

- రాంబిల్లిలో కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన


రాంబిల్లిలో ఆందోళన చేస్తున్న నేవీ నిర్మాణ కాంట్రాక్ట్ కార్మికులు

రాంబిల్లి (యలమంచిలి) : నేవీ నిర్మాణ కాంట్రాక్ట్ కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. రాంబిల్లి నేవీ నిర్మాణంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం రాంబిల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేవీ నిర్మాణ పనులు నేటికి 14 ఏళ్లుగా జరుగుతున్నాయని, ఈ పనులు చేపడుతున్న ఎల్అండ్‌టీ, ఐటీడీఎస్, ఎస్ఎల్‌సి, కేకేఆర్, కేఈసీ వంటి కంపెనీల్లో వేలాది మంది పని చేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఓటీ చెల్లించడం లేదని, బోనస్ చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు కూడా అనేక ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని అన్నారు. ఇప్పటికైనా సెంట్రల్ లేబర్ కమిషనర్ పర్యవేక్షణ జరిపి కార్మికుల కష్టాలు తెలుసుకొని కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కార్మికులను విధుల నుంచి తొలగిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.నారాయణరావు, వై.రాము పాల్గొన్నారు.

## బొజ్జనకొండలో 'లైట్ అండ్ సౌండ్ షో' ప్రారంభం

- గత నెలలో చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించిన వైనం
- బుధవారం రెండోసారి ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు


లైట్ అండ్ సౌండ్ షోను ప్రారంభిస్తున్న స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులు

తుమ్మపాల : గత నెలలో లైట్ అండ్ సౌండ్‌షోను చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. అప్పుడు స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇద్దరూ గైర్హాజరయ్యారు. బుధవారం మరోమారు స్థానిక ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో పాటు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అక్కడ సమకూర్చిన సదుపాయాలను నాయకులకు వివరించారు. తదుపరి మొదటి అంతస్తులో బొజ్జన్నకొండ చరిత్రపై ఏర్పాటుచేసిన లైట్ అండ్ సౌండ్ లేజర్ ప్రదర్శనను ఆద్యంతం తిలకించారు. ముందుగా బొజ్జన్నకొండ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా గ్రామ స్వచ్ఛత హి సేవ పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా స్థాయి సఫాయి మిత్రలను ఘనంగా సన్మానించి అవార్డ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఈ సఫాయి మిత్రలు విజయవాడ వరదల సమయంలో సేవలు అందించారని వారిని ఇలా సన్మానించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, సుందరపు విజయ్ కుమార్, ఏపీయూఐసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జాయింట్ కలెక్టర్ ఎం జాహ్నవి, అనకాపల్లి రెవిన్యూ డివిజన్ అధికారి చిన్నికృష్ణ, ఎస్.డి.సి. కె.వి.ఎస్ సుబ్బలక్ష్మి, డీపీఓ శిరీష రాణి, ఈపీఆర్‌డీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పండక్కి పస్తులేనా?

- సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆవేదన
- రెండు నెలలుగా అందని వేతనాలు
- ఉమ్మడి జిల్లాలో 250 మంది ఉద్యోగులు
- విద్యాశాఖ కార్యక్రమాల్లో వీరిదే కీలక పాత్ర


విశాఖలోని ఎమ్మార్సీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

విశాఖ విద్య: విద్యాశాఖ కార్యక్రమాల అమల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులదే కీలక పాత్ర. అలాంటిది వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా.. తమ సమస్యలు వినకపోగా, కనీసం వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదు. ఆగస్టు, సెప్టెంబర్ వేతనాలపై నేటికీ స్పష్టత ఇవ్వకపోగా.. జీతాలకు నిధులు లేవని రెండు రోజుల కిందట ఉన్నతాధికారులు చెప్పడంతో వీరంతా అసంతృప్తి చెందారు. ఈ దసరా పండక్కి తమ కుటుంబాలు అర్ధాకలితో అలమటించక తప్పదా.? అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 'పాలకులు కరుణించి కనీసం పెండింగ్ జీతాలైనా దసరా ముందు చెల్లించేటట్టు చూడు మహాత్మా'అంటూ బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సీఆర్పీలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కలిపి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 250 మంది వరకు పనిచేస్తున్నారు. వీరిని కాంట్రాక్టు ప్రాతిపదికన ఏటా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నారు. డిగ్రీ, బీఈడీ వంటి ఉన్నత అర్హతలతో ఏళ్ల తరబడి పని చేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 22 రోజుల పాటు సమ్మె చేయగా.. నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వీరి సమస్యలకు పరిష్కారం చూపేలా కమిటీ ఏర్పాటు చేసింది. నాటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో పలు దఫాలుగా చర్చించిన కమిటీ ఉద్యోగ భద్రతకు స్పష్టమైన హామీ ఇచ్చింది. ఈ లోగానే ప్రభుత్వం మారడంతో వీరి సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లైంది.

**పని ఒత్తిడితో సతమతం**

సమగ్ర శిక్షలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు సకాలంలో చెల్లించకపోగా విధుల నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళితే..అలాంటి చోట్ల కాంప్లెక్స్ సీఆర్పీలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. కమిషనరేట్ నుంచి ఉత్తర, ప్రత్యుత్తరాలకు సమాచార సేకరణలో భాగంగా సమయపాలన లేకుండా విధులు నిర్వహించాల్సి వస్తోందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వస్తే ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటుందని కూటమి నేతలు చెప్పిన మాటలు.. ఇప్పుడు ఆచరణలో కనిపించడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా వేతనాలు చెల్లించడంతో పాటు, తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం మరోమారు సమ్మెకు సిద్ధమవుతున్నారు.

### మహాత్మా మా గోడు వినుమా..!


మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నర్సీపట్నం : తమ న్యాయమైన సమస్యలను మహాత్మా మీరైన పరిష్కరించండి.. అంటూ సమగ్ర శిక్ష ఉద్యోగులు గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన సమగ్ర శిక్ష ఉద్యోగులు మున్సిపల్ స్టేడియంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ గౌరవ అధ్యక్షుడు పూడి వెంకటరావు, పట్నాల సతీష్ మాట్లాడుతూ ఉద్యోగులకు సమ్మె కాలం నాటి హామీలను అమలు చేయాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలజీతాలు వెంటనే చెల్లించాలన్నారు. 18 ఏళ్ల నుంచి సమగ్ర శిక్షలో ఒప్పంద విధానంలో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలన్నారు. తమ న్యాయమైన 15 డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో వరహాలనాయుడు, లోకేష్, శ్రీనువాసు, నాయుడు పాల్గొన్నారు.

# ప్రజలు త్యాగాలకు సిద్ధం కావాలి


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అనకాపల్లి: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ ప్రాంత వాసులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంకాలని, విద్యార్థులు, యువత, కార్మికులు, కర్షకులు అంతా కలిసి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాలేపల్లి వెంకటరమణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక నెహ్రూచౌక్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించిన నిరసన దీక్షను బుధవారం కొనసాగించారు. దీక్ష శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బాలేపల్లి వెంకటరమణ ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం దశలవారీగా నిర్వీర్యం చేయడంతో పాటు పెట్టుబడిదారులకు కట్టబెట్టేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే రెండు బ్లాస్ట్ ఫర్నేచర్లలో ఉత్పత్తి నిలిపివేశారని చెప్పారు. ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న 4,200 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించాలని, పర్మినెంట్ కార్మికులను ఇతర ప్లాంట్లకు బదిలీ చేయాలని ఇచ్చిన ఉత్తర్వులు ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. విశాఖ ఉక్కు ఆస్తులను అప్పన్నంగా కొట్టేయాలని కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు పన్నాగం పన్నుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షణకోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ చుట్టూ రాజకీయాలను నడిపి ప్రజా సమస్యలను,స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాలను మరుగును పెట్టేవిధంగా వ్యవహరించడం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లకు తగదన్నారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ రుత్తల శంకరరావు, కో కన్వీనర్ రాజాన దొరబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ దేముడునాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏఐటీయూసీ నాయకులు పి.సత్యనారాయణ, వైఎస్.భద్రం, కోన లక్ష్మణ, అప్పలరాజు, కండిపల్లి త్రినాథ్, ఏసుదాసు, అప్పలరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు సీహెచ్.రాంబాబు, పడాల ఈశ్వరరావు, జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### 6న మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 6న స్థానిక గవరపాలెం నూకాంబిక నగర్ రహదారి, కర్రివారి వీధిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ సమస్త జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం.. భావితరాలకు పరిశుభ్రమైన ఆక్సిజన్ ఇచ్చేందుకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంటి వద్ద మొక్కలను నాటే కార్యక్రమాన్ని పట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

### 4 లీటర్ల నాటు సారా స్వాధీనం

కశింకోట: మండలంలోని పేరంటాలపాలెంలో 4 లీటర్ల నాటు సారా బుధవారం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఇంటి వద్ద సారా విక్రయిస్తున్న పువ్వల సీతారాంను అరెస్ట్ చేశామన్నారు.

### మద్యషాపుల ఏర్పాటుకు దరఖాస్తులు

- నక్కపల్లిలో 8, పరవాడలో 11 షాపులకు అనుమతి
- దరఖాస్తు గడువు 9.. 11న డ్రా
- నక్కపల్లి సర్కిల్ ఎక్సైజ్ సీఐ అనిల్‌కుమార్

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్యం పాలసీలో భాగంగా మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు సబ్బవరం ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన ఎక్సైజ్ పాలసీ గెజిట్ నోటిఫికేషన్ విధి విధానాలను వివరించారు. సబ్బవరం సర్కిల్ పరిధిలోని సబ్బవరం మండలంలో 8, పరవాడ మండలంలో 11 మద్యం షాపులకు దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రూ.2 లక్షల ధరావతుతో కూడిన చలానాలతో ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు రూ.2 లక్షల డీడీని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్, అనకాపల్లి పేరిట తీయాలన్నారు. డీడీతో పాటు ఆధార్/ఓటర్ ఐడీని జతచేయాల్సిందిగా సూచించారు. 11న అనకాపల్లిలోని ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణమండపంలో జిల్లా కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు వెల్లడించారు. డ్రా అనంతరం షాపులు దక్కించుకున్నవారు లైసెన్స్ ఫీజుగా ఏడాదికి రూ.65 లక్షలను మూడు విడతల్లో చెల్లించవచ్చన్నారు. రెండో సంవత్సరం మరో 10 శాతం ఫీజు అదనంగా చెల్లించాలన్నారు. డ్రా పూర్తయిన వెంటనే షాపు దక్కించుకున్నవారు ఆరో వంతు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. డ్రాలో షాపులు పొందినవారు మండల పరిధిలో ఎక్కడైనా షాపును ఏర్పాటుచేసుకోవచ్చని పేర్కొన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 216 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,430 | 5,350 |
| రెండో రకం | 3,560 | 4,330 |
| మూడోరకం | 3,000 | 3,480 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| దేవర | : రాజా |
| మత్తు వదలరా 2 | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| మత్తు వదలరా 2 | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| దేవర | : పర్తిసాయి |
| సత్యం సుందరం | : షిర్డిసాయి |
| దేవర | : వెంకటేశ్వర |
| ప్రేమికుడు | : శ్రీసత్య |
| దేవర | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-18, ఓ పాజిటివ్-8, ఏబీ పాటిజివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 298 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 254 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.



# మహాత్మా.. నిను మరువలేం




ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు



ఎంపీడీవో కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూరిబాబు, ఎంపీడీవో కె.నరసింహరావు



కశింకోట ఎంపీడీవో కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ కలగా లక్ష్మి, అధికారులు, తదితరులు



పశువైద్యశాఖ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఏడీ సౌజన్య, తదితరులు



ఎస్పీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు



జోనల్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహం వద్ద అంజలి ఘటిస్తున్న జెడ్సీ అయ్యప్పనాయుడు



సబ్ జైల్‌లో గాంధీజీ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న జైల్ అధికారి వై.ఎస్.గణేష్‌రెడ్డి



ఎన్టీఆర్ ఆస్పత్రిలో గాంధీ చిత్ర పటం వద్ద అంజలి ఘటిస్తున్న మానవ హక్కుల సంఘం ప్రతినిధులు



కశింకోట శిలపరశెట్టి వీధిలో శుభ్రపరుస్తున్న పంచాయతీ అధికారులు, సిబ్బంది



జెట్టపురెడ్డితుని సంపద కేంద్రం వద్ద గాంధీ చిత్ర పటానికి నివాళులు



తాళ్లపాలెంలో గాంధీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీవో వి.వి.రవికుమార్

- నీ మార్గమే మాకు అనుసరణీయం
- గాంధీ జయంతి కార్యక్రమాల్లో పేర్కొన్న వక్తలు
- జాతిపితతో పాటు లాల్‌బహదూర్ శాస్త్రికి వాడవాడలా నివాళులు

సత్యం, అహింసలను అస్త్రాలుగా చేసుకుని మన దేశానికి స్వాతంత్ర్యం సాధించి పెట్టిన మహనీయుడు మహాత్మాగాంధీ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆయనను ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. నిరాడంబరమైన జీవన విధానంతో ఎందరికో మార్గనిర్దేశకులుగా నిలిచారన్నారు. ఆయన మార్గం యువతకు అనుసరణీయమని పేర్కొన్నారు. గాంధీజీతో పాటు దివంగత మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు.



చింతలపాలెంలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దివ్యాంగులు



అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎస్పీ అప్పారావు



కశింకోటలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి



కశింకోట బాలికల హైస్కూలులో నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం స్వర్ణకుమారి



కలెక్టరేట్‌లో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న డీఆర్వో దయానిధి, సీపీవో రామారావు, తదితరులు

అనకాపల్లి: పట్టణం, మండలంలో పలు ప్రాంతాల్లో జాతిపిత మహాత్మగాంధీజి, లాల్‌బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఎస్పీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆదర్శాలు, విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. బాపూజీ చూపిన అహింసా, సత్యం సిద్ధాంతాలు నేటి పాలకులు, ప్రజలకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు టి.వి.విజయకుమార్, జి.అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో గాంధీజి విగ్రహానికి వాకర్స్ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి అంజిలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు డి.డి.నాయుడు, యల్లపు శివ, శరగడం నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక ఉడ్‌పేట హ్యాపీకిడ్స్ స్కూల్ ఆవరణలో గాంధీజీ చిత్ర పటానికి కరస్పాడెంట్ గిరీష్‌కుమార్, చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఎంపీడీవో కార్యాలయంలో మహాత్ముని చిత్ర పటానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.నరసింహరావు, ఉద్యోగులు పూలమాలలు వేసి అంజిలి ఘటించారు.
- స్థానిక జిల్లా పశువైద్య శాఖ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పశువైద్యశాఖ జిల్లా ఏడీ సౌజన్య, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ జీవిత చరిత్ర గురించి ఆమె వివరించారు.
- జోనల్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి జెడ్సీ అయ్యప్పనాయుడు, ఉద్యోగులు పూలమాలలు వేసి అంజిలి ఘటించారు.
- సబ్ జైలులో స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి జైల్ సూపరింటెండెంట్ ఎస్.రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీ క్లబ్ సభ్యులు పొట్టా లహరి రూ.10 వేలు విలువ చేసే క్యారమ్ బోర్డు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.
- అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో జాతిపిత గాంధీ చిత్ర పటానికి డీఎస్పీ బి.అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రాష్ట్ర మానవ హక్కుల సంఘం కార్యదర్శి శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించి రోగులకు రొట్టె, బిస్కెట్లను పంపిణీ చేశారు. జిల్లా మానవ హక్కుల సంఘం కార్యదర్శి ఎం.ఎస్.నాయుడు, ప్రతినిధులు ఎస్.వి.రమణ, వెంకట అప్పారావు, వెంకటేశ్వరరావు, నరసింగరావు, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో జాతిపిత జయంతిని ఘనంగా నిర్వహించారు. కశింకోట పంచాయతీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంటకోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమేష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం పంచాయతీ కార్యాలయం ముందు మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. శిలపరశెట్టి వీధిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రోడ్లు శుభ్రం చేశారు. స్థానిక బాలికల హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం ఎంఎస్ స్వర్ణకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో బాపూజీ చిత్ర పటానికి ఎంపీపీ కలగా లక్ష్మి పూలమాల వేసి అంజిలి ఘటించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఈవోఆర్‌డీ సోమరాజు, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు కలగా గున్నయ్యనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపాలెంలో గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించి, స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ రెల్లి నాగయమ్మ, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఏపీవో శివ, పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు. జెట్టపురెడ్డితుని పంచాయతీ కార్యాలయం వద్ద, సంపద కేంద్రం వద్ద గాంధీ చిత్ర పటాలకు నివాళులర్పించారు. పంచాయతీ సర్పంచ్ కోన అరుణ, కార్యదర్శి మేరీ జోన్స్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- చింతలపాలెంలో పంచాయతీ వద్ద జాతిపిత విగ్రహానికి చింతలపాలెం, జెట్టపురెడ్డితుని దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు షేక్ రెహమాన్, ప్రతినిధులు జి.సాయికుమార్, కందల రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల: అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు డీఆర్వో బి.దయానిధి, సీపీవో రామారావు, డీఎల్‌డీవో మంజులావాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు రత్నం, రాణి, అధికారులు పాల్గొన్నారు.

## సమస్యలపై సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్న నిరసన



గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

తుమ్మపాల: తమ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. పట్టణంలో మార్కెట్ యార్డ్‌లోని గాంధీ విగ్రహానికి బుధవారం వినతిపత్రం అందజేసి, తమ గోడు చెప్పుకున్నారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలల జీతాలు వెంటనే చెల్లించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలన్నారు. అంత వరకు మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్ట్ టైం విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, సామజిక భద్రత పథకాలు అమలు చేయాలని, పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలంటూ నినదించారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని, మెరుగైన హెల్త్ స్కీం అమలు చేయాలని, సీఆర్‌ఎంటీలు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్స్, మండల లెవెల్ అకౌంటెంట్స్, మెసెంజర్స్, ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ, తదితర ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజరు చేయాలని, ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు



కశింకోటలోని గవరపేటలో శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాటు చేసిన చలువ పందిరి



కశింకోట వద్ద కనకదుర్గ ఆలయంలో కొలువైన దుర్గాదేవి

అనకాపల్లి: శరన్నవ రాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు, గరికి వెంకటరావు తెలిపారు. గురువారం అమ్మవారు స్వర్ణకవచ దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 4న బాల త్రిపుర సుందరిదేవి, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణదేవి, 7న లలిత త్రిపుర సుందరీదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసుర మర్దిని, 12న రాజరాజేశ్వరి దేవి అవతారంలో భక్తులకు కనకదుర్గ అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు.

కశింకోట: మండల గ్రామాల్లో దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలను గురువారం నుంచి నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. కశింకోటలోని గవరపేట, కస్పావీధి, పూసర్ల వీధి, అమరపల్లి వీధి, ద్వారపురెడ్డి వీధి, పెద్ద బజారు, హౌసింగ్ కాలనీ, గోవిందరావు కాలనీ, సత్తెమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. బయ్యవరం, ఏఎస్ పేట, సోమవరం, తాళ్లపాలెం, జమాదులపాలెం, వెదురుపర్తి, కొత్తపల్లి, నరసింగబిల్లి, చింతలపాలెం, ఏనుగుతుని, నూతల గుంటపాలెం, జి.భీమవరం, కన్నూరుపాలెం, తీడ, అచ్చెర్ల, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, విసన్నపేట తదితర గ్రామాల్లో కూడా దుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు సన్నాహాలు చేశారు. కశింకోటలోని సర్వమంగళాంబ సమేత త్రిపురాంతక స్వామి ఆలయంలో కూడా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకుడు వి.చిదంబరం తెలిపారు.

- కశింకోటలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ప్రసిద్ధి కనకదుర్గ ఆలయంలో గురువారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శరన్నవ రాత్రి ఉత్సవాలకు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ వ్యవస్థాపకుడు ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు.

# ఆశాజనకంగా వరి సాగు

- కశింకోట మండలంలో లక్ష్యానికి మించి పడిన నాట్లు
- సాధారణ విస్తీర్ణం 910 హెక్టార్లు కాగా.. 1362 హెక్టార్లలో సాగు



కశింకోట వద్ద ఏపుగా ఎదిగిన వరి

కశింకోట: వాతావరణం అనుకూలించడంతో మండలంలో ఖరీఫ్ వరి పంట ఏపుగా పెరిగి ఎదుగుదల దశలో ఉంది. తేడాది కంటూ రికార్డు స్థాయిలో అదనంగా దాదాపు 500 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. దీంతో రైతులు, అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ వరి పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, గొబ్బూరు, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, తాళ్లపాలెం, గొబ్బూరు, ఏఎస్ పేట, సోమవరం, చింతలపాలెం, నరసింగబిల్లి, ఏనుగుతుని, నూతలగుంటపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, సుందరయ్యపేట, చెరకాం, తీడ, కన్నూరుపాలెం, సింగవరం, గైతులపాలెం తదితర గ్రామాల్లో ఎక్కువగా వరి సాగవుతోంది. ఈ ఏడాది దాదాపు 910 హెక్టార్లు సాధారణ విస్తీర్ణంగా అధికారులు నిర్ణయించారు. అంతకు మించి అనూహ్యంగా 1362 హెక్టార్లలో నాట్లు వేశారు. గతేడాది 808 హెక్టార్లలో సాధారణ విస్తీర్ణం కంటే తక్కువగా నాట్లు పడ్డాయి. సరైన వర్షాలు లేక బయ్యవరం తదితర ప్రాంతాల్లో చాలా వరకు నాట్లు వేయలేదు. ఈ ఏడాది కూడా నాట్లు ప్రారంభమైన జులై చివర తొలినాళ్లలో సరైన వర్షాలు సరిగ్గా పడకపోవడంతో సాధారణ విస్తీర్ణానికి చేరుతుందా? లేదా? అని ఒకింత ఆందోళన ఏర్పడింది. ఈ నేపథ్యంలో వరుసగా రెండు తుపాన్లు రావడంతో నాట్లు పూర్తి కావడమే కాకుండా అదనంగా నాట్లు పడటానికి అవకాశం కలిగింది. అయితే తుపాన్లతో భారీ వర్షాల వల్ల 32 హెక్టార్ల మేర నాట్లు మునిగి పంట దెబ్బతింది. దీనికి రూ.5 లక్షల మేర పరిహారం మంజూరైంది. ఈ నష్టం తప్ప, ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉందని అధికారులు చెబుతున్నారు. వాతావరణం ఇలాగే అనుకూలంగా ఉంటే దాదాపు రెండు నెలల్లో పంట చేతికి వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### అనుకూలించిన వాతావరణం



వరి సాగుకు ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉంది. ఇప్పటి వరకు పంటకు కావలసిన ఎండ, వర్షాలు అవసరమైన మేరకు పడ్డాయి. దీంతో పంట ఎదుగుదల దశలో ఉంది. త్వరలో పొట్ట దశకు చేరుకోనుంది. వాతావరణం అనుకూలిస్తే వచ్చే నెలలో పంట చేతికి వస్తుంది.

– దాడి సత్యారావు, రైతు, కశింకోట

### 1362 హెక్టార్లలో సాగు

వరి పంట ఆశాజనకంగా సాగవుతోంది. 1362 హెక్టార్లలో వరి పంట వేశారు. ప్రస్తుతం పంటపై చీడ పీడలు సమస్య లేదు. పంట సంరక్షణ, ఎక్కువ దిగుబడి పొందడానికి గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను అధికారులు, శాస్త్రవేత్తలు సందర్శించి రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. తుపానుకు 32 ఎకరాలు పైబడి నష్టం ఏర్పడిన మేరకు పరిహారం మంజూరైంది. ఎకరాకు రూ.10 వేలు వంతున రైతు ఖాతాల్లో జమ అవుతోంది.

– ఎం. స్వప్న, మండల వ్యవసాయ అధికారి, కశింకోట

## చిరు ధాన్యాలతో ఆరోగ్యం



మాట్లాడుతున్న సీఐ విజయకుమార్

తుమ్మపాల: చిరుధాన్యాలు వినియోగం ద్వారా ఆరోగ్యంతో జీవించవచ్చని టౌన్ సీఐ విజయకుమార్ అన్నారు. తుమ్మపాల గ్రామంలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి 39వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా టౌన్ సీఐ విజయ్ కుమార్, లూపిన్ ఫార్మా కంపెనీ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రీనివాస్ విచ్చేసి ఆంధ్రప్రదేశ్ బయోడైవర్సిటీ బోర్డ్ వన్యప్రాణి సంరక్షణ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ, విక్రయం చాలా మంచిదన్నారు. చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో శారదా వేలి సంస్థ మంచి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి సీఈవో కర్రి జోగి నాయుడు, మహిళలు పాల్గొన్నారు.